ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

సోమవారం 17 మార్చి 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (సోమవారం సాయంత్రం) సహర్: 5:00 (మంగళవారం ఉదయం)





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



అభివృద్ధి పనుల శిలాఫలకాలను డిజిటల్ స్క్రీన్‌పై ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రూ. 6,500 కోట్లతో వరంగల్ అభివృద్ధి

హైదరాబాద్‌కు దీటుగా పురోగతి పనులు



మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, పక్కన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య

జనగామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని తీర్చుదిద్దుతామని, రూ.6,500కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం జరిగిన 'ప్రజాపాలన- ప్రగతి బాట' బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం వరంగల్‌కు ఎయిర్‌పోర్టు తీసుకొచ్చామని స్పష్టం చేశారు. దీంతో పాటు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్‌రోడ్డు, కాళోజీ కళాక్షేత్రం పనుల కోసం వరంగల్ నగరానికి రూ.6500 కోట్లను మంజూరు చేశామన్నారు. వరంగల్ నగరం హైదరాబాద్‌తో పోటీ పడేలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కడియం కావ్యను గెలిపిస్తే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ తీసుకొచ్చిందని, కాజీపేట జంక్షన్‌ను తీసుకువచ్చే బాధ్యత కూడా కావ్య తీసుకుంటుందని, అందు కోసం భుజం తట్టే బాధ్యత తనదని అన్నారు. ఓరుగల్లు గొప్ప చరిత్ర, చైతన్యం కలిగిన ప్రాంతమని, ఈ గడ్డపై రాణిరుద్రమ, ప్రతాపరుద్రుడు, సమ్మక్క సారలమ్మ, కాళోజీ, దాశరథి, దొడ్డి కొమురయ్య, సర్వాయి పాపన్న, పాల్కురికి సోమనాథుడు జన్మించారని గుర్తుచేశారు. వరంగల్‌కు ఒక ప్రత్యేకత ఉందని, రాష్ట్రానికి ఆదర్శంగా నిలబడడమే కాకుండా రాష్ట్రానికి సమస్య వస్తే నిటారుగా నిలబడి కొట్లాడే కాకతీయ యూనివర్సిటీ ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తోందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, ఉమ్మడి వరంగల్ ప్రజలు కొట్లాడారని గుర్తు చేశారు. అందువల్లే వరంగల్ ప్రాంతమంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉంటుందన్నారు. ప్రజా సమస్యల కోసం స్పందించడమే కాకుండా సమస్యల కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర ఉందని కొనియాడారు.

ఓట్లు అడగడానికి రాలేదు..

రాజకీయం కోసమో, ఓట్లు అడగడానికో ఈ సభను ఏర్పాటు చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం కోసం కడియం శ్రీహరి పట్టుదలతో రూ.800కోట్లు తెచ్చారని రేవంత్‌రెడ్డి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉంచేలా ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధిలో భాగంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వంద పడకల ఆస్పత్రి, సాగునీటి పనులు, డిగ్రీ కాలేజీ నిర్మాణాల కోసం రూ.800 కోట్లను మంజూరు చేశామని పేర్కొన్నారు.



సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, భారీగా హాజరైన ప్రజలు

- మేం వచ్చాకే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు
- కాజీపేటకు రైల్వే డివిజన్ బాధ్యత నాదే..
- రాష్ట్రంలో ఓరుగల్లుకు ప్రత్యేక స్థానం
- కడియం శ్రీహరిని పార్టీలోకి నేనే ఆహ్వానించా..
- రూ.800కోట్లతో 'స్టేషన్‌ఘన్‌పూర్'లో ప్రగతి పరుగులు
- శివునిపల్లి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఘనంగా 'ప్రజాపాలన- ప్రగతి బాట' బహిరంగ సభ

కడియంను పార్టీలోకి నేనే ఆహ్వానించా..

కడియం శ్రీహరి పైరవీలు చేయరని, సొంతపని అడగరని, స్టేషన్‌ఘన్‌పూర్‌కు నిధులు తీసుకెళ్లడం కోసమే వస్తారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అందువల్లే కడియం శ్రీహరిని చూస్తే తనకు భయం వేస్తుందని అన్నారు. శ్రీహరిపై తనకు ప్రత్యేకమైన అభిమానం ఉంటుందని, ఇది ఈనాటిది కాదని చెప్పారు. 25 ఏళ్ల నుంచి తనకు కడియంతో పరిచయం ఉందని, అందుకే కాంగ్రెస్ పార్టీలోకి రావాలనే తానే ఆహ్వానించానని స్పష్టం చేశారు. తనకు అండగా నిలబడాలని, మీలాంటి నిజాయితీ కలిగిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రానికి అవసరం ఉందని తాను కోరానన్నారు. అందులో భాగంగానే కడియం కావ్యను ఎంపీగా గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని మాట ఇచ్చారని గుర్తుచేశారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రతిపాదిత పనులు పూర్తి కావాలన్నా, భవిష్యత్తులో మరిన్ని నిధులు రావాలన్నా కడియం శ్రీహరి నాయకత్వాన్ని బలపరచాలని సీఎం కోరారు.

జయశంకర్ ఊరిని పట్టించుకోని కేసీఆర్

పదేళ్ల అధికారంలో ఉండి ప్రొఫెసర్ జయశంకర్ ఊరిని రెవెన్యూ గ్రామం కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేయలేదని, తాము అధికారంలోకి వచ్చాక రెవెన్యూ గ్రామంగా ప్రకటించామని సీఎం స్పష్టం చేశారు. తమ

మిగతా 7వ పేజీలో...

హోరెత్తిన 'ఘన్‌పూర్' సభ

- సుమారు 50వేల మందికి పైగా హాజరైన జనం
- కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొన్న ఉత్సాహం
- కేసీఆర్‌పై సీఎం ఘాటు వ్యాఖ్యలతో సభలో జోష్
- 850 మంది పోలీసులతో భారీ బందోబస్తు

7



సభలో నినాదాలు చేస్తున్న కళాకారులు

మాకు ఉద్యోగాలు కల్పించండి..

- సీఎం సభలో కళాకారుల నిరసన
- కుర్చీలు ఎక్కి ఫ్లెక్సీ ప్రదర్శన
- బయటకు తీసుకెళ్లిన పోలీసులు

7

ముఖాముఖి



గడ్డం రామ్మోహన్ రెడ్డి, సబ్ డివిజనల్ పోలీసు అధికారి, కాటారం

ప్రజల సహకారంతో నేరాలను నియంత్రిస్తున్నాం..

ఆంధ్రజ్యోతి: కాటారం సబ్ డివిజన్‌లో క్రైమ్‌రేట్ ఎలా ఉంది..?

డీఎస్పీ: సబ్ డివిజన్‌లో నేరాల శాతం తక్కువగానే ఉంది. గతేడాదితో పోల్చుకుంటే కాస్త తగ్గుముఖం పట్టింది.

ఆంధ్రజ్యోతి: శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

డీఎస్పీ: గ్రామాల్లో డ్రగ్స్, గంజాయి నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. ఎక్సైజ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ నాటుసారా కట్టడికి చర్యలు చేపడుతున్నాం. చెడుమార్గాల దిశగా వెళ్తున్న యువతపై నిఘా ఉంచాం.

ఆంధ్రజ్యోతి: నేరాల నియంత్రణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

డీఎస్పీ: ప్రధాన రహదారుల పక్కన ఉన్న గ్రామాలు, పెద్ద ఊళ్లల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. పల్లెల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో వీటిని అమర్చడమే కాకుండా ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. వారి సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేసున్నాం.

ఆంధ్రజ్యోతి: సబ్ డివిజన్‌లో మావోయిస్టుల కదలికలున్నాయా?

డీఎస్పీ: సబ్ డివిజన్‌లో మావోయిస్టుల ఉనికి లేదు. సరిహద్దు రాష్ట్రాలు ఉండటంతో నిరంతరం అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : ప్రమాదాలు నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

డీఎస్పీ : రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నాం. ఇటీవల సబ్ డివిజన్ పరిధిలోని ఎనిమిది మందికి డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జైలు శిక్ష కూడా పడింది. సీఐలు, ఎస్సైలు నిత్యం వాహనాల తనిఖీ చేపడుతున్నారు.

- కాటారం (ఆంధ్రజ్యోతి)

వైభవంగా పుష్పయాగం

- ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- చివరి రోజు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన కోటంచ పరిసరాలు



హంసవాహనంలో లక్ష్మీనరసింహస్వామి శోభాయాత్ర

రేగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బ్రహోత్సవా ల్లో భాగంగా లక్ష్మీనరసింహస్వామి పుష్పయాగం భక్తి శ్రద్ధలతో శోభాయమానంగా సాగింది. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిశాయి. చివరి రోజు భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ఉదయం వేదపండితులు అభిషేకాలు చేశారు. అనంతరం గంటపాటు స్వామివారి నిజరూపంలో దర్శనం గావించారు. సాయంత్రం స్వామి వారిని హంసవాహనంలో పుర వీధుల మీదుగా డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వారాంత సెలవు కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా ఎడ్ల బండ్లు, ఏనుగు వాహనాలు, మేక వాహనాలతో తరలివచ్చారు.

పుష్పయాగం ఇలా..

కోటంచ లక్ష్మీనరసింహస్వామికి జాతర చివరి రోజు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పుష్పయాగం నిర్వహించారు. నాకబలినే పుష్పయాగంగా చెబుతారు. సమస్రనామాలు, ద్రవిడ పారాయణం, పార్శాలు చదువుతూ పుష్పాలను స్వామివారికి అర్పిస్తూ బలి ఇవ్వడమే పుష్పయాగం. ఈ సందర్భంగా 12 కుండ పాత్రల్లో నవ ధాన్యాలను నానబెడతారు. అవి పుష్పయాగం నాటికి మొలకెత్తుతాయి. 1,200 నామాలు చదువుతూ ప్రతి వంద నామాలకు ఒక పాత్రలో ఉన్న మొలకెత్తిన ధాన్యాలను స్వామి వారికి భక్తితో నివేదిస్తారు. ఈ పుష్పయాగాన్ని భక్తులు భక్తిప్రవత్తులతో తిలకించారు.

ప్రశాంతంగా ముగిసిన బ్రహ్యోత్సవాలు

ఎనిమిది రోజుల పాటు జరిగిన కోటంచ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిసాయి. జాతర జరిగిన మూడు రోజుల్లో 3లక్షలకు పైగా భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు లు పటిష్ఠ బందోబస్తును చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో కార్మికులు పరిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచారు. జాతర విజయవంతం చేసిన అధికారు లకు, ప్రజలకు ఈవో మహేష్, ఆలయ చైర్మన్ భిక్షపతి కృతజ్ఞతలు తెలిపారు.



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు, చిత్రంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కల్యాణ మండపం వద్ద నృత్యాలు చేస్తున్న బాలికలు

చివరి రోజు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నాకబలి (పుష్పయాగం)లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగ్గా విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులను చూపిస్తున్న ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు దళ సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఈ మేరకు వెల్లడించారు. తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పూజారి కాంకేర్‌కు చెందిన 20 ఏళ్ల మడవి కోస, 23 ఏళ్ల మడకం సోడి అలియాస్ జోగి పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలిపారు. మడవి కోస సీపీఐ మావోయిస్టు పార్టీలో సీఎస్ఎం దళ సభ్యుడిగా పనిచేస్తున్నాడని, అదే ప్రాంతానికి చెందిన మడకం సోడి అలియాస్ జోగి మిలీషియా సభ్యురాలిగా కొనసాగుతోందని వివరించారు. వీరు సీఎస్ఎం కమాండర్, ఏసీఎం క్యాడర్ మంగు ప్రోద్బలంతో మావోయిస్టు పార్టీలో చేరారని తెలిపారు. మావోయిస్టు పార్టీలో మహిళలపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలు భరించలేక, కాలం చెల్లిన సిద్ధాంతాలకు విసిగిపోయి వీరిద్దరు జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడపడానికి నిర్ణయించారని ఏఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్, వెంకటాపురం సీఐ బండారి కుమార్, వెంకటాపురం ఎస్సై కె. తిరుపతిరావు, ఏఎస్సై డి. నర్సింహ స్వామి, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ అభిషేక్

వాజేడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుమ్మడిదొడ్డిలో ఆ గ్రామానికి చెందిన ఇర్పా అభిషేక్, పద్దం రాంబాబు వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌లపై బయల్దేరారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వీరిని ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. ఇద్దరికీ వైద్యం అందుతుండగా అభిషేక్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలపై వాజేడు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ కన్నెర్ర

జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మ దహనం



అంబేద్కర్ కూడలిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఏకవచనంతో అగౌరవంగా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఈ నిరసన తెలిపారు. రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లా డుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల దురుసుగా మాట్లాడిన జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు దళిత నాయకులు, ప్రజాప్రతినిధుల పట్ల అమర్యాదగా, అవమాన పరిచేలా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి శాశ్వతంగా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు రాజేందర్, సమ్మయ్య, శ్రీనివాస్, సాంబమూర్తి, కర్ణాకర్, మహేశ్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, స్వామి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభం

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ చొరవతో ఉపాధిహామీ పథకం కింద గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణాకి రూ.60 లక్షలు మంజూరు చేశారు. ఆ పనులను మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్ ఆదివారం ప్రారంభించారు. తొలుత గ్రామపంచాయతీ నుంచి ఏపూరు రవీందర్‌రెడ్డి ఇంటి వరకు, అక్కడ్నుంచి అగ్రికల్చర్ కార్యాలయం వరకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రమేష్‌నాయక్ మాట్లాడుతూ గూడూరు ఏజెన్సీ ప్రాంతంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి ఎంపీ బలరాంనాయక్ చొరవ చూపినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తిస్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏపూరు రవీందర్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి యాకూబ్‌పాషా, కన్నబోయిన వెంకన్న, పెసరి శివ, కదీర్, గాదె సాగర్, హెచ్.శివ, యాదగిరి, మండల మల్లేష్, కిషన్, బాలు, చందు, దేవేందర్, రవి, ఐలయ్య, రమేష్, యుగేందర్, మునీష్, నాగస్వామి, చంటి, వెంకన్న, ప్రవీన్, రమేష్, మహేందర్ పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీపీ రమేష్ నాయక్

ఎన్ఎంఎంఎస్ యాప్‌లోనే ఈజీఎస్ కూలీల హాజరు

- రోజు రెండు పర్యాయాలు ఒకే లొకేషన్‌లో ఫొటో
- గ్రామాల్లో తగ్గనున్న కూలీల శాతం

తొర్రూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పనులకు వెళ్లే కూలీలు ఏదో రెండు, మూడు గంటల పాటు వెళ్లామా.! హాజరు పడిందా.. అనే విధంగా ఉండేది. దాంతో మ్యానువల్ హాజరుకు ప్రభుత్వం చెక్ పెడుతూ ఎన్ఎంఎంఎస్ యాప్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) ద్వారా కూలీల హాజరు నమోదు చేయనుంది. క్షేత్రస్థాయిలో ఉండే అధికారులు ఈ యాప్‌లో పని ప్రారంభ సమయంలో మొదటి సారిగా ఫొటో దిగి అప్‌లోడ్ చేసిన ప్రదేశం నుంచే రెండో సారి పని నుంచి వెళ్లే సమయంలో ఫొటో దించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఏదైనా సాంకేతిక లోపంతో అప్‌లోడ్ కాకపోయినా, పనిప్రదేశం మారినా ఫొటో అప్‌లోడ్ కాదు. దీంతో ఆ కూలీ పనికి వచ్చినా గైర్హాజరైనట్లే!. ఇది ఉపాధి హామీ పథకంలో తీసుకువచ్చిన కొత్త విధానమని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా పనుల్లో పారదర్శకత ఉంటుందేమో కాని కూలీలు, క్షేత్రస్థాయి అధికారులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కాగా, కూలీల నమోదు తగ్గడంతో పాటు వెజ్ కంపోనెట్ పడిపోవడంతో పాటు మెటీరియల్ కాంపోనెంట్ కూడా సమకూరదని, దీంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. ఇలాంటి యాప్ ఉపాధి హామీ పథకానికి మంచిదే అయినా అమలులో పూర్తి అసౌకర్యంగా మారుతుంది.



తొర్రూరు మండలంలోని కంఠాయపాలెంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



అమ్మాపురంలో యాప్‌లో కూలీల హాజరు నమోదు చేస్తున్న ఎఫ్ఏ యాకయ్య

ఫొటో అప్‌లోడ్ అయితేనే హాజరు నమోదు

గతంలో ఉపాధి హామీ పనులు చేయాలంటే వర్క్ ఐడీ ఇచ్చేవారు. ఆ వర్క్ ఐడీకి సంబంధించిన ప్రదేశంలో పనిచేస్తున్న కూలీలను క్షేత్రస్థాయి సిబ్బంది ఎక్కడో ఒక్కచోటు నుంచి రెండుసార్లు ఫొటో తీసి స్మార్ట్‌ఫోన్‌లో అప్‌లోడ్ చేసేవా రు. తరువాత మ్యానువల్‌గా ఉన్న మస్టర్‌లో కూలీల హాజరు నమోదు చేసి, వారితో రోజు సంతకాలు చేయించుకునే వారు. ఇలా కూలీల హాజరు జనరేట్ అయ్యేది. కొత్త విధానంతో ప్రతీ రోజు కూలీలు భువన్ యాప్‌లో గుర్తించిన పని ప్రారంభం ప్రదేశంలో ఫొటో దిగి పని పూర్తయిన తరువాత ప్రారంభ ప్రదేశానికి వెళ్లి ఫొటో దిగితేనే హాజరు నమోదయ్యే విధంగా ఉంది. దీంతో కూలీలు పనులు చేసుకుంటూ దూరంగా వెళ్లినా మళ్లీ ప్రారంభ ప్రదేశానికి వచ్చి ఫొటో దిగి అప్‌లోడ్ చేస్తే హాజరు జనరేట్ అవుతోంది. కాగా, పని ప్రారంభం అయిన నాలుగు గంటల తరువాతనే రెండోసారి ఫొటో అప్‌లోడ్ కావడంతో పాటు హాజరు జనరేట్ అవుతోంది. దీంతో కొలతల ప్రకారం పనులు పూర్తి చేసిన కూలీలు ఖచ్చితంగా నాలుగు గంటల సమయం వరకు పని ప్రారంభ ప్రదేశంలో ఆగాల్సిందేనట! దీంతో కూలీలు దూరభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గనున్న హాజరు శాతం

మధు, ఏపీవో తొర్రూరు



ఎన్ఎంఎంఎస్ యాప్‌తో రెండుసార్లు ఫొటోలు దిగి అప్‌లోడ్ చేస్తేనే హాజరు నమోదు అవుతోంది. ఈ యాప్‌తో కొంత మేర కూలీలు ఆసక్తి చూపకపోవడంతో హాజరు శాతం తగ్గే అవకాశం ఉంది. తద్వారా వెజ్ కంపోనెట్ తగ్గి మెటీరియల్ కాంపోనెట్ తగ్గే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్య కారణంగా కూలీలు ఎదుర్కొనే సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతల సన్నిధిలో భక్తుల సందడి ఆదివారం అధికంగా కనిపించింది. సమ్మక్క, సారలమ్మ దేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో తల్లుల గద్దెలకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారెలు, కొబ్బరికాయలు, బెల్లం, యాట మొక్కులను సమర్పించుకున్నారు. అనంతరం మేడారం పరిసరాల్లోని చెట్ల కింద వంటలు చేసుకొని కుటుంబ సభ్యులు, బంధు మిత్రులలతో కలిసి విందుభోజనాలు చేశారు. 10వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సోమన్న (ఫైల్)

పెద్దవంగర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజా మున చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన ప్రకారం... మండల కేంద్రానికి చెందిన శ్రీరాం వెంకన్న చిన్న కుమారుడు శ్రీరాం సోమన్న(24) కొంతకాలంగా సెలూన్ షాప్ నడుపుతున్నాడు. రోజువారీగా సెలూన్ షాపు మూసివేసి ఇంటి వద్ద చేతులు శుభ్రం చేసుకున్నాడు. ఇంటి ముందు బట్టలు ఆరేయడానికి ఏర్పాటుచేసిన ఇనుప వైరుపై ఉన్న షార్ట్(నిక్కర్) తీసుకునే క్రమంలో ప్రమాద వశాత్తు విద్యుత్ వైర్ల నుంచి ఇనుప తీగకు కరెంటు రావడంతో సోమన్న అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, సోమన్న అవివాహితుడు. మృతుడి అన్న శ్రీరాం యాకాంబ్రం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మహిళలందరినీ ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూరులో నాబార్డు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన వ్యాపార సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలందరినీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని, మహిళలు వాటిని వినియోగించుకోవాలని కోరారు. రైతులకు అన్నిరకాల సంక్షేమ పథకాలతో పాటు ఆర్థికంగా ప్రోత్సాహకం అందిస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి సాకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు కిషన్ యాదవ్, సోమ రాజశేఖర్, పెదగాని సోమయ్య, వ్యాపార సంస్థ నిర్వాహకులు, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వ్యాపార సంస్థను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- భర్తే హత్యచేసి ఉంటాడని పోలీసుల అనుమానం?
- ఘటన స్థలాన్ని సందర్శించిన మహబూబాబాద్ డీఎస్పీ

డోర్నకల్(మహబూబాబాద్ జిల్లా), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మండలం హున్యతండాలో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. భర్తే ఆమెను హత్యచేసి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన బానోత్ రామ-బుజ్జి దంపతులకు ఎకరంన్నర వ్యవసాయ భూమి ఉంది. దానిలో వివిధ పంటలను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈక్రమంలో శనివారం తండావాసులతో కలిసి బుజ్జి(48) హోలీ వేడుకలను జరుపుకుంది. రాత్రి భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో.? ఏమో! కానీ ఆదివారం మధ్యాహ్నం రామ తీవ్ర గాయాలతో రక్తపుమరకలతో ఇంటి తలుపులు తీసుకుని బయటకు వచ్చి కిందపడిపోయాడు.



బుజ్జి (ఫైల్)

గమనించిన స్థానికులు వచ్చి ఇంట్లో చూడగా గది నిండా రక్తపు మరకలు కనిపించాయి. అనుమానం వచ్చిన వారు కాస్తంత లోపలికి వెళ్లి చూడగా బుజ్జి రక్తపు మడుగులో ఉండి మృతి చెంది ఉంది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ రాజేష్, ఎస్సై ఉమ గాయాలతో పడివున్న బుజ్జి భర్త రామను చికిత్స నిమిత్తం 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం బుజ్జి మృతికి గల కారణాలను పరిశీలించారు. భార్యాభర్తలు ఇద్దరు పరస్పరం దాడి చేసుకోవడంతో బుజ్జికి తీవ్ర గాయాలై మృతి చెంది ఉండవచ్చని, రామకు తీవ్ర గాయాలై ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటన స్థలాన్ని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు సందర్శించారు. అనంతరం ఫోరెన్సిక్ సిబ్బంది వివరాలు సేకరించారు.

గోదావరిలో అరుదైన చేప లభ్యం

వాజేడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని పూసూరు గోదావరిలో ఆదివారం అరుదైన చేప లభ్యమైంది. సముద్రంలో లభించే చీతోల్(సీతా ల్) చేప గోదావరిలో ఓలేటి హరిబాబు అనే జాలరికి చిక్కింది. సుమారు ఆరు కేజీల బరువు ఉంది. ఈ చేపలు ఎక్కువగా సము ద్రంలోనే దొరుకుతాయని, వాజేడు గోదావరి లో కనిపించడం ఇదే మొదటిసారని జాలరి హరిబాబు తెలిపాడు.




చీతోల్ చేపతో జాలరి హరిబాబు

హేమాచల క్షేత్రంలో కోలాహలం



భక్తులతో కిటకిటలాడుతున్న హేమాచల క్షేత్రం,



సుందరంగా అలంకరించిన లక్ష్మీనరసింహ స్వామి మూలవిరాట్టు

మంగపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలో ఆదివారం కోలాహలం కనిపించింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారి మూలవిరాట్టును అర్చకులు నూతన వస్త్రాలు, గజమాలతో సుందరంగా అలంకరించారు. తిలా, తైలాభిషేకాలు చేసి దైవ దర్శనాలు గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సుమారు 18వేల మంది భక్తులు హేమాచల క్షేత్రానికి చేరుకొని ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. జలాంజనేయస్వామి, పంచముఖాంజనేయస్వామి, రమా సత్యనారాయణ స్వామి, వేణుగోపాల స్వామిని దర్శనాలు చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది మురళీకృష్ణశర్మ, రిటైర్డు ప్రధానార్చకుడు కైంకైర్యం రాఘవాచార్యులు స్వామి వారి దర్శనం గావించి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామి వారిని వరంగల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు జడ్జి నిర్మలా గీతాంబ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ సంప్రదాయాల ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారితోపాటు ఉప దేవాలయాల దేవుళ్లను జడ్జి దర్శించుకున్నారు. ఆమె వెంట ఎస్సై టీవీఆర్ సూరి, ఆర్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

ఇసుక సమస్యను పరిష్కరించాలి

- 20న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి : సీఐటీయూ

మహబూబాబాద్ టౌన్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక సమస్యను పరిష్కరించాలని, ఇల్లు నిర్మించుకునే ప్రతీ ఒక్కరికి ఉచితంగా సరఫరాచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బానోత్ శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ నెహ్రూ సెంటర్‌లో ఆదివారం 20న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీని రూపొందించే క్రమంలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేవారికి ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తామని ప్రకటించిందని, అలా కాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగా ఇల్లు నిర్మించుకునే వారికి ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీని ప్రకటించిన తర్వాత ఇసుక దొరకడం ఇబ్బందిగా మారిందని, గతంలో టన్ను ఇసుక రూ.1000కి దొరికితే నేడు రూ.2 వేలు అయిన దొరకడంలేదన్నారు. ఇసుక సమస్యను పరిష్కరించాలనే డిమాండ్‌తో జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులందరిని సమీకరించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వెల్ఫేర్‌బోర్డు ఆన్‌లైన్ అప్డేట్ పేరుతో గత 6 నెలల నుంచి నిలిపివేశారని, దీంతో పేర్లు నమోదు చేసుకోవడానికి రెన్యువల్, క్లెయిమ్ కోసం కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బోర్డు ఆన్‌లైన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, పెళ్లికానుకలను రూ.లక్ష పెంచాలని కోరారు. కార్యక్రమంలో కుమ్మరికుంట్ల నాగన్న, సర్వన్, వెంకన్న, రాము, బిచ్యా పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడు

- మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు
- ఘనంగా అటల్‌జీ యాదిలో ఆత్మీయ సమ్మేళనం

న్యూశాయంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి విలువలకు కట్టుబడిన గొప్ప రాజనీతిజ్ఞుడని, తాను నమ్మిన సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడి ఆదర్శప్రాయంగా జీవించిన మహోన్నత వ్యక్తి అని మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు శ్లాఘించారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని డికన్వెన్షన్ బంకెట్ హాల్‌లో అటల్‌జీ యాదిలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అధ్యక్షత మహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసాగర్‌రావు తొలుత వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత రాజకీయాలలో భావజాలాలకు అతీతంగా అందరి గౌరవాన్ని పొందిన ఏకైక వ్యక్తి అటల్ అన్నారు. బతికినన్ని రోజులు ఆజాత శత్రువుగా అందరి మన్ననలను పొందిన మహోన్నతవ్యక్తి అని అభివర్ణించారు. జర్నలిస్టుగా వాజ్‌పేయి ప్రస్థానం ప్రారంభమైందని, శ్యాంప్రసాద్ ముఖర్జీతో ఉన్న అనుబంధం అపర దేశభక్తుడిగా మార్చిందన్నారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ బోధనలు విని భరత బిడ్డల రోదనలు చూసి భారతీయ ఆత్మను అర్థం చేసుకొని ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండాలని నిర్ణయించుకున్నాడని విద్యాసాగర్ రావు చెప్పారు. అధికార వ్యామోహంలేని వాజ్‌పేయి ఒక్క ఓటుతో ప్రభుత్వం పడిపోతుందని తెలిసి ఢిల్లీపీఠాన్ని తృణప్రాయంగా వదిలుకున్నాడు కానీ.. విలువలను వదులుకోని గొప్ప వ్యక్తి అన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్ రావు

ప్రధానమంత్రిగా వాజ్‌పేయి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాడన్నారు. స్వర్ణభుజీ రహదారులతో నవ భారత నిర్మాణానికి పునాదులు వేశాడని, పనికి ఆహార పథకం తెచ్చి కోట్లాది మంది ప్రజల ఆకలి తీర్చాడన్నారు. ప్రధాన మంత్రి సడక్‌యోజనతో మారుమూల పల్లెలకు కూడా బీటీ రోడ్లు నిర్మించాడని కొనియాడారు. పోక్రాన్‌లో అణుపరీక్ష నిర్వహించి శత్రుదేశాల వెన్నులో వణుకు పుట్టించాడని, ఎన్ని దేశాలు ఒత్తిడి చేసినా, ఆర్థికపరమైన ఆంక్షలు విధించినా వెనక్కితగ్గని మొండి ధైర్యం వాజ్‌పేయి సొంతమని విద్యాసాగర్ రావు శ్లాఘించారు. వాజ్‌పేయ కవితా పటిమ ఈ దేశంలోని ఏ రాజకీయ నాయకుడికి రాలేదని, ఆయన భావోద్వేగ ఉపన్యాసాలకు మంత్రముగ్ధం కాని ఏ ప్రపంచ వేదిక లేదని పేర్కొన్నారు. భారత మాత కన్న అసలు సిసలైన భారత రత్న వాజ్‌పేయి అని విద్యాసాగర్ అన్నారు.

మాజీ ఎంపీ, వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సంధానకర్త అజ్మీరా సీతారాంనాయక్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా దేశశ్రేయస్సు కోసం నిరంతరం పరితపించిన గొప్ప నాయకుడు వాజ్‌పేయి అని అన్నారు. వాజ్ పేయి ప్రసంగాలు బీజేపీ శ్రేణులకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమేనన్నారు. ఆయన చూపిన బాటలో బీజేపీ ముందుకుసాగుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ తప్పిదాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం కాంగ్రెస్ చేస్తున్న పొరపాట్లతో రేపు రాష్ట్రం బీజేపీ నేతృత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ రానున్నదన్నారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల నుంచి పొందే ప్రేరణ రాష్ట్రంలో బీజేపీని మరింత బలంగా ముందుకు తీసుకుపోగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కాగా, తొలుత బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంటా రవికుమార్, కొలను సతీష్ రెడ్డి మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావుకు స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ బీజేపీ అధ్యక్షుడు నాగపురి రాజమౌళి గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు మంద అయిలయ్య, కన్నబోయిన రాజయ్య యాదవ్, దేవేందర్ రెడ్డి, నిశిధర్ రెడ్డి, బలరాం, సోడా రమేష్‌తోపాటు వాజ్‌పేయి సుదీర్ఘ రాజకీయ, పరిపాలనలో ఆయనతో కలిసి ప్రయాణించినవారు, వారి ఆశయాలను కొనసాగిస్తున్నవారు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. వాజ్‌పేయికి సంబంధించిన తీపి జ్ఞాపకాలుగా తమ వద్ద ఉన్న ఛాయా చిత్రాలు, ఆయనతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ సందర్భంగా సమ్మేళనంలో అందచేశారు.



స్టేషన్ ఘన్‌పూర్ బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, నాయకులు


చేపల వలతో సీఎం రేవంత్‌రెడ్డి

హోరెత్తిన ఘన్‌పూర్ సభ

- సుమారు 50 వేల మందికి పైగా హాజరైన జనం
- కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొన్న ఉత్సాహం
- కేసీఆర్‌పై సీఎం ఘాటు వ్యాఖ్యలతో సభలో జోష్


సభకు తరలి వస్తున్న మహిళలు

జనగామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన- ప్రగతి బాట్ బహిరంగ సభ విజయవంతమైంది. సభకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచే కాకుండా జనగామ నియోజకవర్గం, వరంగల్ నగరం నుంచి ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. సీఎం రావడానికి గంట ముందే సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సభకు 50వేల మందిని తరలించాలని అధికారులు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి భావించగా అంతే మొత్తంలో సభకు జనం వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సీఎం 33 నిమిషాలు ప్రసంగించగా ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. సభకు వచ్చిన ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్త కోసం వాటర్, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ముందస్తు చర్యల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. సభకు జనం భారీగా తరలిరావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. సీఎం ప్రసంగం ఆద్యంతం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ప్రతిపక్ష నేత కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ నేతలపై రేవంత్‌రెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యలకు సభికుల నుంచి విశేష స్పందన లభించింది. సీఎం సభ నేపథ్యంలో 850 పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

40 నిమిషాలు ఆలస్యంగా సీఎం రాక

సీఎం షెడ్యూల్‌కు 40నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. మధ్యాహ్నం 1గంటకు రావాల్సిన సీఎం 1.40గంటలకు హెలిక్యాప్టర్‌లో సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో చేరుకున్నారు. అక్కడ సీఎంకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఘనస్వాగతం పలికారు. శాలువాలు కప్పి బొకే అందించి ఆహ్వానించారు. అక్కడి నుంచి నేరుగా స్టాళ్లను సందర్శించారు. ఒగ్గు, ఇతర కళాకారులు డప్పు చప్పుళ్లు, గిరిజన మహిళ సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెంబర్తి హస్తకళలు, సిలికాన్ కాటన్ టెక్స్‌టైల్, స్వయం సహాయక సంఘాల సభ్యులు చేసిన స్వగృహ ఉత్పత్తులు, విజయ డెయిరీ, ఆయిల్‌పామ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ స్టాళ్లను సీఎం ఆసక్తిగా తిలకించారు. మహిళలను, సిబ్బందిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. తర్వాత ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఒక్కో మండలానికి ఒక్కో బస్సు చొప్పున 7 ఆర్టీసీ బస్సులు మంజూరవగా వాటిని సీఎం ప్రారంభించారు.

అక్కడి నుంచి నేరుగా సభా వేదికపైకి మధ్యాహ్నం 1.57 గంటలకు చేరుకున్నారు. ప్రజలకు అభివాదం అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీఎంను శాలువా బొకేతో సన్మానించారు. ఆ తర్వాత జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలాకాలను వేదిక పైనుంచే రిమోట్ ద్వారా ఆవిష్కరించారు. కాగా.. బహిరంగ సభలో భాగంగా సీఎం మధ్యాహ్నం 2.54 గంటలకు నుంచి 3.27గంటల వరకు 33 నిమిషాల పాటు ప్రసంగించారు. సభ ముగిసిన అనంతరం 3.30 గంటలకు హెలికాప్టర్‌ద్వారా తిరుగు ప్రయాణమయ్యారు. మొత్తంగా ఒక గంటా 50 నిమిషాల పాటు పర్యటన సాగింది.


నృత్యం చేస్తున్న కళాకారులు, చిన్నారులు →




సీఎం సభకు ట్రాక్టర్‌పై వస్తున్న మహిళలు

మాకు ఉద్యోగాలు కల్పించండి..

- సీఎం సభలో కళాకారుల నిరసన
- కుర్చీలు ఎక్కి ఫ్లెక్సీ ప్రదర్శన


నిరసన తెలుపుతున్న కళాకారులను అడ్డుకుంటున్న పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కళాకారులుగా పనిచేసిన వారిని గత ప్రభుత్వం విస్మరించడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేయడంపై రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ సీఎం సభలో నిరసన వ్యక్తం చేశారు. సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో బాధిత మహిళా కళాకారులు ఒక్కసారిగా కుర్చీల పైకి ఎక్కి వారి వెంట తెచ్చుకున్న 'మా ఉద్యమ, నిరుద్యోగ కళాకారులకు సారథిలో ఉద్యోగాలు కల్పించాలి' రాసి ఉన్న ఫ్లెక్సీని ప్రదర్శించారు. సీఎం వెంటనే స్పందించి.. 'చూశాను కూర్చోండి..' అని సూచించారు. అక్కడ ఉన్న మహిళా పోలీసులు కళాకారులను కిందకు దింపి సభ నుంచి బయటకు తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా బాధిత కళాకారులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం సమయంలో కళాకారులుగా పనిచేశామని, గత ప్రభుత్వం రాష్ట్రంలో 550 మందికి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. నిజమైన కళాకారులమైన తమలాంటి 750 మందిని విస్మరించారన్నారు. అనేకసార్లు గత సీఎంకు తమ గోడును వినిపించినా పట్టించుకోలేదని, అసెంబ్లీ ఎన్నికల ముందు నిరసన సమయంలో అప్పుడు ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం రాగానే ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాగా, అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ అపాయింట్‌మెంట్ లభించడం లేదని, పలుమార్లు ఆయన ఇంటికి వెళ్లినా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. తమ సమస్య సీఎం దృష్టికి వెళ్లాలనే ఉద్దేశంతో నిరసనను వ్యక్తం చేశామన్నారు.

హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల, సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి జిల్లాలకు సంబంధించిన 200 మంది కళాకారులం సీఎంకు తమ సమస్యను శాంతియుతంగా ఫ్లెక్సీ ద్వారా ప్రదర్శించడానికి వచ్చామని వెల్లడించారు. అందరం ఒకే చోట కూర్చునే అవకాశం రాకపోవంతో కొందరు మాత్రమే నిరసన వ్యక్తం చేయాల్సి వచ్చిందన్నారు. నిరసన వ్యక్తం చేసిన తమను మహిళా పోలీసులు విచక్షణారహితంగా బయటకు లాక్కెల్లడం సరికాదని వాపోయారు. ఈ కార్యక్రమంలో కళాకారులు అనువోజు వెంకటేష్, మట్టెడ కవిత, దబ్బెట పుష్ప, పరకాల రమ, కొండ్రా కుమార్, పున్న రమేష్, పట్టెం స్రవంతి, మోతె రమేష్, రాణి, అలేఖ్య, రోజా, స్వరూప, స్రవంతి, సంతోషిని, బాలమణి, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా..

- మధ్యాహ్నం 1.40గంటలకు హెలిప్యాడ్‌లో ల్యాండింగ్
- 1.48గంటలకు సీఎంకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే ఘన స్వాగతం
- 1.51 గంటలకు మహిళా శక్తి బస్సుల ప్రారంభం
- 1.52 గంటలకు స్టాళ్ల సందర్శన
- 1.57 గంటలకు వేదికపైకి చేరుకున్న సీఎం
- 1.59 గంటలకు జ్యోతి ప్రజ్వలన
- 2.04 గంటలకు రిమోట్ ద్వారా శిలా ఫలాకాల ఆవిష్కరణ
- 2.54 గంటలకు ప్రసంగం ప్రారంభం
- 3.27 గంటలకు ప్రసంగం ముగింపు
- 3.30 గంటలకు హెలికాప్టర్‌లో తిరుగుప్రయాణం


సభలో అభివాదం చేస్తున్న సీఎం

వడ్డీ మాఫీ పథకం ప్రారంభం


మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ

జనగామ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించి వడ్డీ మాఫీ పథకాన్ని సీఎం రేవంత్ స్టేషన్‌ఘన్‌పూర్ సభా వేదిక నుంచి ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ కింద గతంలో తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీని చెల్లించారు. మహిళలు చెల్లించిన వడ్డీని మాఫీ చేస్తూ తిరిగి వారి ఖాతాల్లో ప్రభుత్వం చెల్లించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా 92.74 కోట్ల వడ్డీ మాఫీకి సంబంధించిన చెక్కును డీఆర్‌డీఏ అధికారులు, మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి అందించారు. దీంతో పాటు బ్యాంకు లింకేజీ కింద జనగామ జిల్లాకు రూ.100.93కోట్ల రుణాలకు సంబంధించి చెక్కును సైతం అందజేశారు.


మహిళా సంఘాలకు బస్సులను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు



సభ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

పేదోళ్ల కష్టాలు తీర్చే ప్రభుత్వం ఇది..

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పేదోళ్ల కష్టాలు తీర్చే ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన సీఎం సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై మాట్లాడని వ్యక్తి కేసీఆర్ అని, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడేవారన్నారు. ఇప్పటి వరకు అసెంబ్లీకి కేవలం రెండుసార్లు మాత్రమే వచ్చారన్నారు. ఎక్కడ నిజాలు మాట్లాడాల్సి వస్తుందనే భయంతోనే కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటే భయపడుతున్నాడని విమర్శించారు. లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్.. ఇందిరమ్మ ప్రభుత్వంపై మాట్లాడడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రోజుకు 16గంటల పాటు పని చేస్తున్నారని, అలాంటి వ్యక్తిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓడినా కూడా సిగ్గులేకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎమెల్యే కడియం శ్రీహరి పట్టువదలని విక్రమార్కుడని, నియోజకవర్గానికి రూ.800కోట్ల నిధులు తీసుకురావడం గొప్ప విషయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు కేసీఆర్ వృథా చేశారన్నారు.

10 నెలల పాలనలో 47 వేల ఉద్యోగాలు ఇచ్చాం..

మంత్రి సీతక్క



బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల కాలంలో 84వేల ఉద్యోగాలు ఇస్తే, 10నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 57 వేల ఉద్యోగాలు ఇచ్చిందని పంచాయతీరాజ్, గిరిజన శాఖామంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2లక్షల ఇళ్లు కూడా ఇవ్వలేదని, కానీ, ఏకకాలంలో నాలుగున్నర లక్షల ఇండ్లను ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళల నాయకత్వాన్ని బలపర్చడం, ఉద్యోగ ఉపాధి కల్పించడమన్నారు. పేదలకు కూడు, గుడ్డ కల్పించడమన్నారు. ఉద్యోగాలు, ఇళ్లు ఇస్తుంటే ప్రతిపక్షాలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ అంటేనే మహిళలను అణగదొక్కడం, అట్టడుగు వర్గాలను అణగదొక్కడమని, అహంకారాన్ని ప్రదర్శించడమని తెలిపారు. 30ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణకు రూపం తీసుకువచ్చామని తెలిపారు. బీసీ కుల గణన చేబడితే బీఆర్ఎస్, బీజేపీలు అక్కసు వెళ్లబోసుకుంటున్నాయని తెలిపారు. రాష్ట్రంలోకి అక్కాచెల్లెల్లకు సోదరుడిగా సీఎం రూ.92కోట్ల మహిళలకు అందిస్తున్నారని తెలిపారు. బీజేపీ కులాల పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. ఓట్ల కోసం కులాలను, మతాలను బీజేపీ రెచ్చగొడుతోందన్నారు.

తెలంగాణను బీఆర్ఎస్ నాశనం చేసింది..

మంత్రి కొండా సురేఖ



బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేసిందని దేవాదాయశాఖ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హైదరాబాద్‌కు సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, అందుకు తగిన వనరులు ఇక్కడ ఉన్నాయన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ఉన్నన్ని రోజులు రాష్ట్రంలో మహిళకు ఇబ్బందులు రావని భరోసా ఇచ్చారు. సీఎం ఇచ్చినమాట తప్పరని పేర్కొన్నారు. పదేళ్లలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తోడ్పాటుతో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందన్నారు.

సీఎం సహకారంతో వరంగల్ అభివృద్ధి

వరంగల్ ఎంపీ కడియం కావ్య



సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిలో ముందుకు వెళ్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారని, రానున్న రోజుల్లో గుజరాత్ మాడల్‌గా కాకుండా దేశంలో తెలంగాణ మోడల్‌గా నిలిచేలా కృషి చేస్తున్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధిలో కడియం ముందు వరుసలో ఉంచుతున్నారని తెలిపారు. వరంగల్ అంటే సీఎంకు ఎంతో అభిమానమన్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు మామునూరు ఎయిర్‌పోర్టును, రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని తీసుకురావడానికి ఎంతగానో సీఎం కృషి చేశారన్నారు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం, రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఆయనతో తనకు ఉన్న స్నేహం, నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. పార్టీలో చేరిన తక్కువ సమయంలోనే నియోజ కవర్గానికి రూ.800కోట్ల నిధులు మంజూరు ఇవ్వడమే కాకుండా శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సీఎం, అధికారుల సహకారంతో 18నెలల కాలంలో శంకుస్థాపన చేసి పనులన్నింటినీ పూర్తిచేసి ప్రారంభిస్తానన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ప్రభుత్వం ద్వారా 3,500 ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని, వీటికి తోడుగా సీఎం స్టేట్ రిజర్వు కోటా నుంచి మరికొన్ని ఇండ్లు ఇవ్వాలని సీఎంను కోరారు. ఘన్‌పూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి నిధులు ఇవ్వాలని కోరారు. 15 ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అవినీతి, అక్రమాలు, పదవులు, పనులు, పథకాలు అమ్ముకోవడం, తాగడం, తూలడం తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. వర్ధన్నపేట, పాలకుర్తి, ఘన్‌పూర్, తుంగతుర్తి నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి దేవాదుల ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-6 ఫేజ్-3 ద్వారా 80వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. చిలుపూర్, వేలేరు రెండు మండలాలు కొత్తగా ఏర్పడ్డాయని, మండల కాంప్లెక్స్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రాన్ని దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలని సీఎం చూస్తున్నారన్నారు.

రూ.6,500 కోట్లతో వరంగల్ అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం వచ్చాకే వరంగల్‌కు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్‌రోడ్డు, కాళోజీ కళాక్షేత్రం వచ్చాయని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాకే స్టేషన్‌ఘన్‌పూర్ రూ.800కోట్లు వచ్చాయని, వీటితో ఇంటిగ్రేటెడ్ స్కూల్, వంద పడకల ఆస్పత్రి, డిగ్రీ కాలేజీ నిర్మించుకోగలుగుతున్నామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ప్రతీ సమస్యను పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరామ్‌నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్విని‌రెడ్డి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం సభకు హాజరైన ప్రజలు

బీఆర్ఎస్‌పై భగ్గుమన్న కాంగ్రెస్




ములుగు, చిట్యాలలో జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ములుగు కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో ములుగులోని 163వ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టి ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ మాట్లాడుతూ అధికారం పోయినా బీఆర్ఎస్ నాయకులకు అహం తగ్గలేదని, దళితులను అవమానించడమే బీఆర్ఎస్ పని దుయ్యబట్టారు. అట్టడుగువర్గాల ప్రజలు ఇప్పుడిప్పుడే అధికారంలో భాగస్వామ్యం అవుతుంటే అది చూసి తట్టుకోలేక అవమానకరంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పదినెలల్లో చేసి చూపించిందని, దానిని చూసి ఓర్వకనే బీఆర్ఎస్ నాయకులు కారుకూతలు కూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పార్టీ బ్లాక్, యూత్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా దళిత మంత్రులు కొప్పుల ఈశ్వర్, తాటికొండ రాజయ్యను సొంత పార్టీ అని కూడా చూడకుండా అవమానించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, యూత్ అధ్యక్షుడు వంశీరాజ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంట్ల దేవేందర్‌రెడ్డి, నాయకులు దుర్గయ్య, మోత్కూరి రవి, రంగు రవీందర్, తాటి లచ్చయ్య, రాజబాపు, రెడ్డిపల్లి రవి, మాడెం ప్రసాద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

● మల్హర్ (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల అనుచితంగా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి సభ్యత్వాన్ని శాసనసభ ఎథిక్స్ కమిటీ ద్వారా రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మండల కేంద్రమైన తాడిచర్లలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. జగదీశ్వ ర్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా రమేష్ డిమాండ్ చేశారు. సమావేశంలో పాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఐత రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, రాజసమ్మయ్య, తిరుపతిరావు, తిర్రి సమ్మయ్య, కేసారపు చంద్రయ్య, కట్కం శ్రీనివాస్, కుంట సదానందం, ఆకుల శ్రీనివాస్, రాజునాయక్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

● టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ కోరారు. అసెంబ్లీలో స్పీకర్‌తో ఏకవచనంతో అగౌరవంగా ఆయన మాట్లాడటం అహంకార ధోరణికి నిదర్శనమని విమర్శించారు. కేటీఆర్ కూడా స్పీకర్ పట్ల అనుచితంగా మాట్లాడారని దుయ్యబట్టారు. వీరిద్దరి దిష్టిబొమ్మలను మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు బండ శ్రీకాంత్, నాంపెల్లి వీరేశం, మాదం కొమరయ్య, కనుమరుగల సదయ్య, దాసారపు సదానందం, బండి రవి, ఎడ్ల రమేస్, ఆడెపు సంపత్, కొలుగూరి అనిల్, పెరుమాండ్ల క్రాంతి, వంగ కుమారస్వామి, వంగ నరేష్, ఎలబోయిన రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): స్పీకర్‌పై వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను మండల కేంద్రంలోని చౌరస్తాలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నాయకులు దహనం చేశారు. బీఆర్ఎస్‌పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశంలో బీఆర్ఎస్‌పార్టీ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి, మాజీమంత్రి కేటీఆర్ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను ఉద్దేశించి నువ్వు అని ఏకవచనంతో అవమానపరిచిన వారిద్దరిపై చర్యలు తీసుకుని అసెంబ్లీ నుంచి శాశ్వతంగా సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌కు దళితులంటే చిన్నచూపు అని, దళితవర్గాలు అంటే ఎందుకు ఇంత కోపమని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, దళిత కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓనపాకల ప్రసాద్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజు, ఏఎంసీ డైరెక్టర్ లింగయ్య, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్, నాయకులు నరహరి, బక్కిరెడ్డి, దండ వెంకటేశ్వర్‌రెడ్డి, మంగళపల్లి శ్రీనివాస్, రొంటాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ దళిత సంఘాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాటారం ప్రధాన చౌరస్తాలో నిరసనకు దిగారు. కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగదీశ్వర్‌రెడ్డి శాసనసభ సభ్యత్వం రద్దు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ సమ్మయ్య, నాయకులు వంశవర్ధన్‌రావు, రాజు, మధుకర్, శ్రీకాంత్, ప్రభాకర్, లచ్చిరెడ్డి, కిరణ్, అజీజ్, రమేష్, రాజబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను మండల కేంద్రంలో దహనం చేశారు. ఈసందర్భంగా చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి అవహేళనగా మాట్లాడటం దురంహకారానికి నిదర్శనమన్నారు. దళిత స్పీకర్‌ను విమర్శించిన ఎమ్మెల్యేకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు స్పందించడం ఖండనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, జిల్లా కార్యదర్శి రాయకొంరు, మండల ప్రధానకార్యదర్శి గడ్డం కొమురయ్య, యూత్ మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు శ్రీనివాస్, రత్నాకర్‌రెడ్డి, రవి, జ్యోతి, సంతోష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్ష

టేకుమట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణను పూర్తి చేశాకే ప్రభుత్వం నియామకాలను చేపట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల శంకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న నిరాహారదీక్ష కొనసాగుతోంది. ఆదివారం ఏడో రోజు సంఘం జిల్లా నాయకులు రేణుకుంట్ల సంపత్, రాం రాంచంద్ పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాగానే అసెంబ్లీలో ఏ హామీలైతే ఇచ్చారో వాటికి కట్టుబడి ఉండకుండా ఉద్యోగ నియామకాల ఫలితాలను వెల్లడించడాన్ని ఖండిస్తున్నమన్నారు. వర్గీకరణ పూర్తయిన తర్వాతే ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మచ్చ శ్రీకాంత్, అంబాల అనిల్, కన్నూరి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడి మృతి

దుగ్గొండి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కేశవాపురంలో ఆదివారం చోటు చేసుకొంది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొంతల సాయికుమార్(28) పని మీద ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి పెంచికలపేటకు వెళ్లివస్తున్న క్రమంలో గ్రామ గౌడ సంఘం భవనం వద్ద బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టగా తలకు బలమైన గాయమైంది. దీంతో గ్రామస్థులు, అతని బంధువులు సాయికుమార్‌ను 108 వాహనంలో ఆరెపల్లిలోని ఎన్ఎస్ఆర్ ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి సాయికుమార్ చనిపోయినట్లు వెల్లడించారు. మృతి చెందిన సాయికుమార్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కొనసా గుతూ ప్రైవేట్ ఉద్యోగం చేశాడు. మృతుడి సోదరుడు బొంతల క్రాంతికుమార్ ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి సాయికుమార్ మృతదేహాని కి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

చిట్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బుర్ర కనుకయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు మధువంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, రత్నాకర్‌రెడ్డి, గంగాదరి రవీందర్, మల్లయ్య, శ్రీనివాసరావు, అల్లం రాజు తదితరులు ఉన్నారు.



మృతుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

నేడు భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ

మల్హర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (భవన నిర్మాణ కార్మిక సంఘం) మూడో మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకటేశ్ కోరారు. మండల కేంద్రమైన తాడిచర్లలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్డింగ్ రంగంలో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులతో సతమతమవతున్నారని, వీరి సంక్షేమాన్ని పాలవర్గాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లిలో జరిగే కార్యక్రమానికి భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బందర్ లావణ్య, ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్, నారాయణ, రమేష్, రవి, సతీష్, శ్యామ్, నరేష్, నర్సయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్, కండక్టర్ మధ్య తీవ్ర వాగ్వాదం

చిల్లర విషయంలో ఘర్షణ

బహిరంగంగా పరస్పరంగా దూషించుకున్న వైనం

భూపాలపల్లి బస్టాండ్‌లో ఘటన

కృష్ణకాలనీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఓ కానిస్టేబుల్, ఆర్టీసీ బస్ కండక్టర్ ఘర్షణ పడ్డారు. అసభ్య పదజాలంతో దూషించుకున్నారు. ఈ సంఘటన భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణ కోసం వచ్చిన కానిస్టేబుల్ హనుమకొండ నుంచి భూపాలపల్లికి ఆర్టీసీ బస్సులో ప్రయాణించాడు. రూ.500 నోటు ఇచ్చి టికెట్ తీసుకున్నాడు. మిగిలిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా కండక్టర్ టికెట్ వెనుక రాశాడు. తన గమ్యస్థానం భూపాలపల్లికి చేరుకున్న కానిస్టేబుల్ మిగిన డబ్బులను కండక్టర్‌ను అడిగాడు. తన దగ్గర చిల్లర లేదని, కాసేపు ఆగమని కండక్టర్ చెప్పగా.. తనకు లేట్ అవుతోందని త్వరగా ఇవ్వమని కానిస్టేబుల్ అడిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఘర్షణకు దారి తీసింది. ఇద్దరు పరస్పరంగా అసభ్యకర పదజాలంతో దూషించుకున్నారు. మధ్యలో జోక్యం చేసుకున్న బస్సు డ్రైవర్ సైతం కానిస్టేబుల్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో ఒకరినొకరు చెయ్యి చేసుకొనే పరిస్థితి ఎదురైంది.. దీంతో అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది వచ్చి ఇరువురిని సముదాయించడంతో అక్కడి నుంచి ఇరువురు వెళ్లిపోయారు.



సుమనవాణి
తాడ్వాయి ఎంపీడీవో

ముఖాముఖి

పకడ్బందీగా ఉపాధి హామీ పనులు

ఆంధ్రజ్యోతి : ఉపాధిహామీ (ఈజీఎస్) పనుల టార్గెట్ ఎంత?

ఎంపీడీవో : మండల వ్యాప్తంగా 1.5 లక్షల రోజులుగా ఈజీఎస్ పనులు చేపట్టాలని లక్ష్యం పెట్టుకున్నాం.

ఆంధ్రజ్యోతి : టార్గెట్‌కు ఎంత పూర్తయింది?

ఎంపీడీవో : 91 శాతం పని దినాలు పూర్తి చేశాం.

ఆంధ్రజ్యోతి : కూలీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

ఎంపీడీవో : నీడ సౌకర్యం, ప్రథమ చికిత్స ఏర్పాటు చేస్తున్నాం. తాగునీరు సౌకర్యం కల్పించడంతోపాటు ఓఆర్ఎస్ అందిస్తున్నాం. పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : రోజువారీగా చెల్లించే సగటు కూలి ఎంత?

ఎంపీడీవో : రోజువారీగా రూ. 236 నుంచి రూ.300 వరకు కూలి చెల్లిస్తున్నాం

ఆంధ్రజ్యోతి : ఈజీఎస్ పథకంలో ఎలాంటి పనులు చేపడుతున్నారు?

ఎంపీడీవో : పొలాలకు కాలిబాటలు, చెరువు పూడికలు, మొక్కలు నాటడం, పాడి పెంపకం షెడ్ల నిర్మాణాలు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా భూముల్లో ఫారం పాండ్స్ (చిన్న నీటి కుంటలు) ఏర్పాటు చేస్తున్నాం.

- తాడ్వాయి (ఆంధ్రజ్యోతి)

బిల్ట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి

మంగపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమలాపురంలో ఖాయిలాపడ్డ బిల్ట్ ఫ్యాక్టరీని పునుద్ధరించి తమ కుటుంబాలను ఆదుకోవాలని సీనియర్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని కమలాపురం సీపీనగర్‌కాలనీ ఎదు రుగా బిల్ట్ కార్మికుల ప్రత్యేక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సీనియర్ కార్మికులు మాట్లాడుతూ బిల్ట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంత్రి సీతక్క మాట్లాడాలని అన్నారు. బిల్ట్ కర్మాగారం ఖాయిలా పడటంతో నష్టపోయిన కార్మికులను ఆదుకొని న్యాయం చేయాలని కోరారుబిల్ట్ యాజమాన్యం, కార్మిక జేఏసీ నాయకులు కుమ్మక్కై మోసం చేశారని ఆరోపించారు. తమకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు సహకరించాలని కోరారు. బిల్ట్ యాజమాన్యం పరిశ్రమను అమ్మేయగ కార్మిక జేఏసీ నాయకులు కోట్లు సంపాదించుకున్నారని, కార్మికులను మాత్రం రోడ్డున పడేశారని దుయ్యబట్టారు. కార్మిక జేఏసీ నాయకులు కోర్టు తీర్పు కాపీని కార్మికులకు వివరాలతో బహిరంగంగా తెలపాలని డిమాండ్ చేశారు. 650 మంది కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, గ్రాడ్యూటీ, పీఎఫ్‌లను ఇప్పించాలని కోరారు. జనగాం జిల్లా రఘునాథపల్లిలో ఉన్న భూమిని తమకు న్యాయపరంగా అందించాలన్నారు. ఆ భూములపై ఎవరైనా ఆజమాయిషీ చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బిల్ట్ సీనియర్ కార్మికులు బత్తుల వెంకటనారాయణ, గులగట్టు విజయరావు, గూడ యాదగిరి, పంజాల సత్యనారాయణ, ముత్తినేని వెంకటేశ్వర్లు, గాజర్ల శ్రీను, తాటికొండ వెంకటేశ్వర్‌రావు, కలాస రాం చందర్, అన్నపూర్ణ, పార్వతి, తాడెల దశరథం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిల్ట్ సీనియర్ నాయకుడు

పురుగుల మందు తాగి ఆత్మహత్య

రేగొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తపల్లిగోరి మండలంలోని చెంచుపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామానికి చెందిన బండి సారంగపాణి(25) వ్యవసాయ కూలి పని చేస్తుండేవాడు. మద్యం తాగిన మత్తులో శనివారం అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెం దాడు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

కురుమ సంఘం అడ్‌హక్ కమిటీ ఖరారు

భూపాలపల్లిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కురుమ సంఘం అడహక్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని వీరప్ప గుడి ఆవరణలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కమిటీని ఖరారు చేశారు. కమిటీ జిల్లా బాధ్యులుగా దయ్యాల కిరణ్, కొరె సుధాకర్, కుమారస్వామి, రవి, రాజయ్య, కొమురయ్య, మండల బాధ్యులుగా అశోక్, నాగరాజు, శ్రీనివాస్, శంకర్, జనార్ధన్, కృష్ణ, సాంబయ్య శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

రామప్పను సందర్శించిన చిలీ దేశస్థుడు



ఆలయ శిల్పకళను తిలకిస్తున్న చిలీ దేశస్థుడు డేవిడ్

వెంకటాపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని సౌత్ అమెరికాలోని చిలీ దేశానికి చెందిన డేవిడ్ ఆదివారం సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవాలయ శిల్పకళా సంపదను వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. ఆలయ చరిత్ర, విశిష్టతను గైడ్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను తిలకించారు.

నేడు గుడిసె వాసుల పాదయాత్ర

హాజరుకానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వాజేడు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీఐ సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఏడాదిన్నర కాలంగా ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న గుడిసె వాసులు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర నిర్వహించనున్నారు. గుడిసెవాసుల పోరాట కేంద్రం నుంచి ఏటూరునాగారం ఐటీడీఏ వరకు ఇది కొనసాగనుంది. గుడిసె వాసులకు తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్ర చేపట్టనున్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఇందులో పాల్గొని సంఘీభావం తెలపనున్నారని ఆ పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు తెలిపారు. .

మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ అధ్యక్షుడి పరామర్శ



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న లక్ష్మీనర్సింహరావు

ఏటూరునాగారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు (లక్ష్మణ్ బాబు) మండలంలోని రొయ్యూరు, శంకరాజుపల్లి గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి దశ దిశ కర్మలకు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌రావు, మండల అధ్యక్షుడు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, జిట్ట ఈశ్వర్, రొయ్యూరు, అల్లం చంటి యాదవ్, శంకరాజుపల్లి, అంతటి సంతోష్ యాదవ్ ఉన్నారు.

సీతక్కను విమర్శించే స్థాయి బీఆర్ఎస్‌కు లేదు : కాంగ్రెస్

ఏటూరునాగారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. ఏటూరునాగారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘుతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి సీతక్కపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు చేసిన అనుచిత వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి మాట్లాడాలి తప్ప పండుగలకు వచ్చి మాట్లాడటం సరికాదని దుయ్యబట్టారు. మంత్రి సీతక్కపై చేసిన అనుచిత వ్యాఖలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. అయ్యుబ్ ఖాన్, జిల్లా నాయకులు వావిలాల చిన్నఎల్లయ్య, చెన్నూరి బాలరాజు, ముక్కెర లాల్లయ్య, మండల యూత్ అధ్యక్షుడు నవీన్, వావిలాల నర్సింగరావ పాల్గొన్నారు.

కాకులమర్రి వ్యాఖ్యలు ఖండనీయం

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు వ్యాఖ్యలు ఖండనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోల్లు దేవేందర్ అన్నారు. పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతం అయిన తాడ్వాయి మండలం లింగాల, బందాల గ్రామాలకు కనీసం రహదారి నిర్మాణం కూడా చేపట్టలేన్నారు. ములుగు నియోజకవర్గ అభివృద్ధికి సీతక్క అహర్నిశలు తన వంతు కృషి చేస్తున్నారని అన్నారు. తప్పుడు మాటలను వెంటనే లక్ష్మణ్‌బాబు వెనక్కి తీసుకోవాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లచ్చుపటేల్, సునీల్, పులి సంపత్, ముజాఫర్, కల్యాణి, జగన్, రాజేందర్, శివ, జైపాల్‌రెడ్డి, చంద్రయ్య, రమేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఏటూరునాగారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను, వ్యవసాయ కూలీలను వాహనాల్లో ఎక్కించుకోవడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై తాజుద్దీన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గూడ్స్ ట్రాలీలు, ఆటోలు, డీసీఎం వంటి వాహనాల్లో ప్రయాణికులను, వ్యవసాయ కూలీలను ఎక్కించుకుని అధిక లోడుతో అతివేగంగా ప్రయాణించడం ప్రమాదకరమన్నారు. వాహన యజమానులు, డ్రైవర్లు ట్రాఫిక్ నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జాతీయ రహదారి 163పై పరిమితికి మించి వ్యవసాయ కూలీలను ఎక్కించుకుని అతివేగంగా వాహనాలు నడపడం వల్ల గతంలో ప్రమాదాలు జరిగి కూలీలు మృతి చెందిన సంఘటనలు జరిగాయని గుర్తు చేశారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా వాహన యజమానులు, డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, చేయొద్దని అన్నారు.

'మంత్రివర్గంలో మాదిగలకు చోటు కల్పించాలి'

ఏటూరునాగారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అత్యధికంగా ఉన్న మాదిగలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు వావిలాల స్వామి మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆయన ఆదివాదరం సందర్శించారు. ములుగు జిల్లా గౌడ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సప్పిడి రామనర్సయ్య గౌడ్ సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడారు.ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకులు ఎంపల్లి శంకర్ మాదిగ, దేపాక సతీష్ మాదిగ, వాసంపల్లి విజయ్, నెగారకుంటి రాజాబాబు, మెడిచర్ల నర్సింగరావు పాల్గొన్నారు.